సాయం అందక..

- ఖరీఫ్ మొదలైన అందని అన్నదాత సుఖీభవ పథకం
- ఎదురుచూస్తున్న రైతన్నలు
- చిన్న, సన్నకారు రైతుల్లో ఆందోళన
- అప్పులు చేసి సేద్యం పనులు

కొత్తపల్లి: రాష్ట్రంలో ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్ అంటూ విరామంలేకుండా అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఒక్కో సారి ఒక్కో విధంగా రైతన్నకు కష్టాలు, నష్టాలు తప్పడంలేదు. వారిని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2024 ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను ఇస్తామని హామీ ఇచ్చారు. అందులో అన్నదాత సుఖీభవ పథకం కూడా ఒక్కటి. అయితే ఇప్పటి కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం గడుస్తున్నా రైతన్నకు మాత్రం అన్నదాత సుఖీభవ పథకం ఊసేలేదు. దీంతో రైతన్నలు అసలు పథకం అమలు చేస్తారా లేదా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

9 వేల ఎకరాల సాగుభూమి

మండలంలో 12 గ్రామపంచాయతీలు, 18 మజరా గ్రామాలు ఉన్నాయి. వీటిలో మొత్తం 34వేలకు పైగా జనాభా ఉన్నారు. మండలంలో మొత్తం 12వేల ఎకరాలు భూమి ఉండగా అందులో 9 వేల ఎకరాల భూమి సాగుకు అనువైనదిగా ఉంది. మండలంలో సుమారు 10,469 మంది రైతులు ఉన్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు సుమారు 8 వేల ఎకరాలను రైతులు మొక్కజొన్న, కంది, మిరప, మినుము, పత్తి, వరి, ఇతర పంటలను సాగు చేసుకునేందుకు సిద్ధం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు సంక్షేమ పథకాలు అందించేందుకు రైతు విశిష్ట సంఖ్య ద్వారా 6,800 మందిని గుర్తించారు.


వీరాపురం గ్రామం వద్ద ఖరీఫ్ సీజన్ కోసం దుక్కి దున్నుతున్న రైతు

సాగు కోసం అప్పులు

ఖరీఫ్ సీజన్ కోసం రైతులకు విత్తనాలు, దుక్కులకు సుమారు ఎకరానికి రూ.4 వేల దాకా ఖర్చు అవుతుంది. అయితే కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఇస్తామని చెప్పి నమ్మబలికి ఇప్పటి వరకు ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చిన్న, సన్నకారు రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయనడంలో అతిశయోక్తి లేదు. సేద్యాల నుంచి విత్తనాలు, కలుపులు, కోతల వరకు అన్ని అప్పులే చేసి పంటలను సాగుచేస్తున్నారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు అయింటే ఈ తిప్పలు ఉండకపోయేది అని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సర కాలం అవుతుంది. పోయిన పంటల సీజన్‌లో కూడా అన్నదాత సుఖీభవ వేయలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పంటల సాగు మొదలవుతోంది. ఇప్పటివరకు ప్రభుత్వం రైతులకు ఎలాంటి నగదు బదిలీ చేయలేదు. త్వరగా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేస్తే బాగుంటుంది.

– రామసుబ్బారెడ్డి, సింగరాజుపల్లె రైతు

అప్పులు చేసి సేద్యం పనులు



సకాలంలో వర్షాలు పడడంతో ఖరీఫ్ సీజన్‌కోసం పంట పొలాలను సిద్ధం చేసుకుంటున్నా. ఆరు ఎకరాలను కౌలుకు తీసుకొని సాగుచేసుకుంటున్నా. వాటికి చాలా ఖర్చు అవుతుంది. ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నగదు వేసివుంటే కొద్దిగా అసరా అయ్యేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సకాలంలో నగదు వేసేది. దీంతో అప్పులు చేయాల్సిన అవసరం వచ్చేదికాదు.

– చంద్రమౌళి, గువ్వలకుంట్ల గ్రామరైతు

క్లుప్తంగా

మహానంది కిటకిట


మహానందీశ్వరుడి దర్శనార్థం వేచి ఉన్న భక్తులు

మహానంది: వేలాది మంది భక్తులతో ఆలయ ప్రాంగణాలు ఆదివారం కళకళలాడాయి. సెలవురోజు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు ముందుగా స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం ఉచిత, శీఘ్ర, అతి శీఘ్రదర్శనం, స్పర్శ దర్శనం, అభిషేకం, క్షీరాభిషేకం ఆర్జిత సేవాటికెట్ల ద్వారా శ్రీ కామేశ్వరీ దేవి, శ్రీ మహానందీశ్వరస్వామి ఆలయాలతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు.

పరామర్శ


మోతుకూరులో బోగోలు నాగన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న శిల్పా

వెలుగోడు: మోతుకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బోగోలు నాగన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరామర్శించారు. నాగన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నాగన్న కుమారుడు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్ నాయుడు, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

శుభకార్యం

వెలుగోడు: గుంతకందాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మౌలాలి కుమార్తె వివాహం ఆదివారం గుంతకందాలలో నిర్వహించారు. వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే శిల్పా పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ఏపీటీఎఫ్ ధ్యేయం

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏపీటీఎఫ్ పనిచేస్తుందని ఆ సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నగిరి శ్రీనివాసులు, మల్లెల పుల్లయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోపాల్‌రావు, జయరాం అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో సంఘం వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్సీ కామ్రేడ్ మార్క్ బాలకృష్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గుంతలమయంగా కేజీ రోడ్డు


తంగడంచ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డు

జూపాడుబంగ్లా: వర్షాల వల్ల కర్నూలు–గుంటూరు రోడ్డు జూపాడుబంగ్లా నుంచి నందికొట్కూరు వరకు గుంతలమయంగా మారింది. జూపాడుబంగ్లా బస్టాండు మలుపు వద్ద రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తంగడంచ రావిచెట్టు వద్ద, మండ్లెం గ్రామంలో మలుపుల వద్ద రోడ్డు గుంతలు ఉండటంతో వాహనాల డ్రైవర్లు ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనాలదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అర్ అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకొని గుంతలను పూడ్చించాలని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు కోరుతున్నారు.


మండ్లెం వద్ద గుంతలు పడిన రోడ్డు

గ్రామాల్లో కార్డెన్ సెర్చ్


కరివేనలో అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేస్తున్న సీఐ రాము, పోలీసులు

ఆత్మకూరు: చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా కార్డెన్ సెర్చ్ చేపడుతున్నామని పట్టణ సీఐ రాము తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున మండలంలోని కరివేన, కురుకుంద, నల్లకాలువ తదితర గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఆయా గ్రామాల్లో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, అనుమానితుల నివాసాల్లో సోదాలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 10 మోటారు సైకిళ్లు, అక్రమంగా కలిగిఉన్న 10 బీరు బాటిళ్లు, 12 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయాలి

నందికొట్కూరు: మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకాలు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, ఎంసీపీఐ(యూ) జిల్లా కన్వీనర్ లాజరస్ డిమాండ్ చేశారు. ఆదివారం మిడుతూరు మండలంలోని కడుమూరు గ్రామంలో రైతులతో కలిసి ఆ పార్టీల నాయకులు ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని కోరుతూ కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ మండలంలోని 24 గ్రామాలకు 40 వేల ఎకరాల మెట్ట భూములకు ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరందించాలన్నారు. మండలంలోని రైతులు కేవలం వర్షాధారంపైనే ఆధాపరడి పంటలను సాగు చేసే దుస్థితి ఉందన్నారు. మిడుతూరు మండల రైతులు కరువుకాటకాలతో అల్లాడిపోతున్నారని, పంటలు పండక అప్పుల బాధలు భరించలేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు నాయుడు ఎత్తిపోతల పథకం మంజూరు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా అమలు చేయలేదని మండిపడ్డారు. స్థానిక ప్రజా ప్రతినిధులు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి చేసి ఎత్తిపోతల పథకం సాధించాలన్నారు. మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకం సీఎం చంద్రబాబు మంజూరు చేయాలని కోరుతూ ఈ నెల 16వ తేదీన ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు పెద్ద సంఖ్యలో ధర్నాకు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు మద్రిస్వామి, శ్రీను, సోమన్న, శేఖర్, గ్రామ రైతులు శేషు, జీవన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


లెక్చరర్స్ కాలనీలో రక్షణ గోడ లేకుండా ట్రాన్స్‌ఫార్మర్

వెలుగోడు: మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ఆత్మకూరు– నంద్యాల ప్రధాన రహదారిలోని లెక్చరర్స్ కాలనీలో రోడ్డు పక్కన ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండటం, రక్షణ గోడ లేకపోవడంతో పశువులు, వాహనదారులకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు, నంద్యాలకు ఈ రహదారిలో నిత్యం వేలాదిగా ప్రయాణిస్తుంటారు. వాహనాలు అదుపుతప్పితే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొనే అవకాశం ఉంది. అధికారులు స్పందించి కంచె ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

- డ్రోన్ కెమెరాల సాయంతో స్థావరం గుర్తింపు


పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

ఆత్మకూరు: ఆత్మకూరు–శ్రీశైలం రహదారిలోని పట్టణ శివారులో పేకాట ఆడుతున్న కొందరిని ఆత్మకూరు పోలీసులు డ్రోన్ కెమెరాల సాయంతో స్థావరాలను గుర్తించి ఆదివారం అరెస్టు చేశారు. డ్రోన్ల సాయంతో ఆత్మకూరు టౌన్ సీఐ రాము ఆధ్వర్యంలో పేకాట స్థావరాలను గుర్తించారు. ఆత్మకూరు–శ్రీశైలం వెళ్లే రహదారిలో రోడ్డు నుంచి చాలా దూరంలో ఓ చెట్టు కింద కూర్చొని ఉండగా సీఐ పోలీసు సిబ్బంది, డ్రోన్ కెమెరాలతో తనిఖీలు నిర్వహిస్తుండగా కొంతమంది గుంపులుగా ఉండడం గమనించి దాడులు చేశారు. 9 మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.17,320 నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

44 మంది ఉపాధ్యాయుల రాక

మహానంది: నంద్యాల జిల్లాలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న 44 మంది ఉపాధ్యాయులు మహానంది మండలానికి బదిలీపై వచ్చారని ఎంఈఓ రామసుబ్బయ్య తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ మండలంలో పని చేస్తున్న 13 మంది ఉపాధ్యాయులు వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లారన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూళ్లకు ఒక్కో పాఠశాలకు నలుగురు, ఐదుగురు చొప్పున ఉపాధ్యాయులను కేటాయించారన్నారు. అందులో భాగంగా అబ్బీపురం 5, బుక్కాపురం 4, మసీదుపురం 5, బొల్లవరం 5 మంది చొప్పున విధుల్లో చేరారన్నారు.

19 మంది ఉపాధ్యాయుల బదిలీ

వెలుగోడు: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న 19 మంది టీచర్లు (ఎస్‌జీటీ) ఇతర మండలాలకు బదిలీ అయినట్లు ఎంఈఓ బ్రహ్మానాయక్ తెలిపారు. బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఎంఈవో ఆదివారం రిలీవింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. విద్యాభివృద్ధికి కృషి చేసి, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని వారికి సూచించారు.

అనుమతులిచ్చిన వెంటనే రిజర్వాయర్ మరమ్మతులు

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుమతులిచ్చిన వెంటనే అలగనూర్ రిజర్వాయర్ మరమ్మతుల పనులు చేపడతామని ఎమ్మెల్యేలు జయసూర్య, మైదుకూరు పుట్ట సుధాకర్ యాదవ్ స్పష్టం చేశారు. ఆదివారం మిడుతూరు మండల పరిధిలోని అలగనూర్ రిజర్వాయర్ వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ అలగనూర్ రిజర్వాయర్ మరమ్మతులు పూర్తి చేసేందుకు అధికారులు రూ.36 కోట్లతో ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు.

భక్తుడి నిజాయితీ

మహానంది: మహానందీశ్వరుడి దర్శనానికి వచ్చిన తెలంగాణ భక్తుడు ఆదివారం నిజాయితీ చాటుకున్నాడు. మహానంది ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని విధులకు వచ్చే క్రమంలో కారును రథ మండపం వద్ద ఆపి కారు డోర్స్ లాక్ చేయకుండా వెళ్లాడు. గుర్తించిన హైదరాబాద్‌కు చెందిన భక్తుడు సంపత్‌రెడ్డి కారులోని పర్సు, నగదుతో పాటు విలువైన కార్డులను తీసుకొచ్చి సమాచార కేంద్రంలో అప్పగించారు. సంపత్ రెడ్డిని స్థానికులు అభినందించారు.

బైక్‌పై నుంచి పడి వ్యక్తికి గాయాలు

మహానంది: వజ్రాల వేటకు వచ్చి బైక్‌పై వెళ్తున్న కరుణాకర్ అదుపు తప్పి కిందపడి గాయాల పాలైన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. జడ్చర్లకు చెందిన కరుణాకర్ కొద్ది రోజుల క్రితం గాజులపల్లె సమీపంలోని సర్వ నరసింహస్వామి ఆలయం వద్ద ఉన్న వంకలో వజ్రాల కోసం వచ్చాడు. గాజులపల్లె నుంచి ఆంజనేయపురం వరకు వెళ్తుండగా బైకు అదుపు తప్పి కిందపడటంతో గాయపడ్డాడు. రోడ్ సేఫ్టీ పోలీసులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం టోల్‌గేట్ వద్ద శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిని పట్టుకున్నారు. ఆదివారం శ్రీశైలానికి చెందిన సంపంగి గణపతి 14 బెంగళూరు విస్కీ బాటిళ్లు ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా శ్రీశైలం టోల్‌గేట్ వద్ద తనిఖీలు చేస్తుండగా..పట్టుబడ్డాడు. మద్యం బాటిళ్లు, బైక్‌ను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు శ్రీశైలం సీఐ ప్రసాదరావు తెలిపారు. తనిఖీలో పోలీసులు రఘునాథుడు, బాలకృష్ణ, బాలోజీనాయక్ పాల్గొన్నారు.

మహానంది దేవస్థానం ఏఈఈకి గాయాలు

మహానంది: దేవస్థానంలో ఇంజినీరింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఏఈఈ శ్రీనివాసులు యాదవ్‌కు ఆదివారం గాయాలయ్యాయి. విధులు ముగించుకుని నంద్యాలకు వెళ్తుండగా సుగాలిమెట్ట సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది.

దీంతో ఆయనకు పలు చోట్ల గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న దేవస్థాన ఉద్యోగులు శ్రీనివాసులును పరామర్శించారు.

మలుపులు.. ప్రమాద కేంద్రాలు


ప్రమాదాలకు తరచూ కారణమవుతున్న బండి ఆత్మకూరు సుంకులమ్మ మలుపు


ప్రమాద సూచికలు లేని సంతజూటూరు ఆంజనేయ స్వామి ఆలయం వద్ద మలుపు

బండిఆత్మకూరు : మండలంలోని నంద్యాల – ఆత్మకూరు ప్రధాన రహదారిలోని మలుపులు... ప్రమాదాలకు కేంద్రంగా మారాయి. ప్రధానంగా స్థానిక సుంకులమ్మ మలుపు, సంతజూటూరు వద్దనున్న ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదాలు అధికంగా చోటు చేసుకుంటున్నాయి. ఈ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయి. మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ. కోడూరు గ్రామం నుంచి పెద్దదేవలాపురం గ్రామం వరకు దాదాపు 20 మలుపులు ఉన్నాయని, ఒక్క చోట కూడా సూచిక బోర్డులు లేవని చెబుతున్నారు. సంబంధిత అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి



మండల పరిధిలోని ప్రధాన రహదారితో పాటుగా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లోని మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. రాత్రి సమయాల్లో హెచ్చరిక బోర్డు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అధికారులు స్పందించి బోర్డులు ఏర్పాటు చేస్తే.. ప్రమాదాలు తగ్గుతాయి.

– దూదేకుల హుసేన్ బాబు, పెద్ద దేవళాపురం


గురువులతో పూర్వ విద్యార్థులు

13ఏళ్ల తర్వాత..

మహానంది: మండల కేంద్రమైన ఎం.తిమ్మాపురంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2011–12 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకేచోట కలిశారు. ఈ మేరకు వారు జిల్లా పరిషత్ పాఠశాలకు చేరుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సరదాగా గడిపారు. నాడు వారికి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి సన్మానించారు.

వర్షం..ఎండ!

మహానంది: ఆలయ పరిధిలో ఆదివారం సాయంత్రం భారీ గాలులతో పాటు కొద్ది పాటి జల్లులు పడ్డాయి. పది నిమిషాలు చినుకులు కురిసిన వెంటనే ఎండ కాసింది. మహానందీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యాలను ఆసక్తిగా తిలకించారు.


మహానందిలో వర్షం కురుస్తున్న దృశ్యం

నూతన కమిటీ ఎన్నిక

వెలుగోడు: మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్పీ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధికార ప్రతినిధి బాషపోగు దరగయ్య మాదిగ తెలిపారు. ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎస్పీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఓనమాల. వెంకటేశ్వర్లు మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా లబ్బి శ్రీనివాసులు మాదిగ, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా మల్లెపూల సాలమ్మ మాదిగను ఎన్నుకున్నట్లు చెప్పారు. బి.ఆరోగ్యం, టి.వెంకటేశ్వర్లు, ఈ.నవీన్ పాల్గొన్నారు.

జోరుగా రేషన్ బియ్యం వ్యాపారం

జూపాడుబంగ్లా: రేషన్‌బియ్యం వ్యాపారం చేసే వారిని ఉపేక్షించేదిలేదంటూ కూటమి ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తుంటే అధికార పార్టీ నాయకులే అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కూటమినేతల అండదండలతో నందికొట్కూరు కేంద్రంగా రేషన్‌బియ్యం వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలు అన్నచందంగా కొనసాగుతుందనే విమర్శలున్నాయి. నందికొట్కూరు పట్టణానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులను ప్రసన్నం చేసుకొని వారి అండదండలతో మండలంలోని మండ్లెం, తంగడంచ, జూపాడు బంగ్లా, తరిగోపుల, పారుమంచాల, తూడిచెర్ల, భాస్కరాపురం, పోతులపాడు గ్రామాల్లోని వినియోగదారుల నుంచి రేషన్‌బియ్యం కొనుగోలు చేస్తున్నారు. పడి బియ్యం రూ.25 నుంచి రూ.30ల చొప్పున కొనుగోలు చేసి వాటిని రాత్రి వేళల్లో ఎవరికంటపడకుండా నందికొట్కూరు పట్టణానికి తరలించి, అక్రమంగా నిల్వచేసి.. అక్కడి నుంచి గుట్టుచప్పుడు కాకుండా తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం.



ఈనెల 10తేదీన పోలీసులు పట్టుకొన్న పట్టుబడిన రేషన్‌బియ్యం, ఆటో

ఈనెల 10తేదీన మండ్లెం గ్రామంలో కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకొని ఆటోను, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ లోగానే బియ్యం వ్యాపారులకు అభయహస్తం ఇస్తున్న అధికారపార్టీ నాయకులు ఎస్‌ఐకి ఫోన్‌చేసి ఆటోను వదిలిపెట్టాలని ఆదేశించినట్లు చర్చించుకుంటున్నారు. దీనిని బట్టిచూస్తే అక్రమంగా రేషన్‌బియ్యం వ్యాపారం చేస్తున్న వారికి అధికార కూటమి ప్రభుత్వం నాయకుల అండదండలు ఏలాగున్నాయో అర్థం చేసుకోవచ్చు.


వర్షం తగ్గాక వినియోగదారులతో వారపు సంత


వర్షపు నీళ్లలో కూరగాయలు

వానలో వారపు సంత

పాములపాడు: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే వారపు సంతలో వర్షం కారణంగా వ్యాపారులు, వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వారపు సంతకు మండలంలోని పలు గ్రామాల ప్రజలు వస్తారు. సాయంత్రం వేళలో వినియోగదారులతో రద్దీగా ఉంటుంది. అయితే సాయంత్రం వేళలోనే ఓ మోస్తరు వర్షం కురవడంతో ప్రజలు ఉరుకులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు నిత్యావసర సరుకులు, కూరగాయలు, ఆకుకూరలు వర్షానికి తడవకుండా కాపాడుకునేందుకు పడిన ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. వినియోగదారులు రహదారికిరువైపులా ఉన్న దుకాణాలు, ఇళ్లలోకి వెళ్లాల్సి వచ్చింది. కొద్ది సమయం తరువాత వర్షం తగ్గడంతో యథావిధిగా వ్యాపారాలు కొనసాగాయి. కొద్ది సమయం మాత్రమే కురిసిన వర్షానికి కూరగాయలు ఉంచిన పట్టలపై నీళ్లు నిలిచాయి. నీళ్లు తోడి పోసేందుకు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మండల కేంద్రమైనప్పటికీ వారపు సంతలో సరైన సౌకర్యాలు లేకపోవడంపై ప్రజలు, వ్యాపారులు పెదవిరుస్తున్నారు. ప్రతి దుకాణం నుంచి రుసుము వసూలు చేసే పంచాయతీ అధికారులు సౌకర్యాల గురించి మాత్రం ఆలోచించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.